క్లుప్తంగా

వెంకటేశ్వరుడికి శాంతి కల్యాణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శాంతి కల్యాణాన్ని నేత్ర పర్వంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఉభయకర్తలుగా వెంకటగిరి, కోటేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేన్సర్ హాస్పిటల్, జెడ్పీ కాలనీ, సారాయంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీనగర్, గౌతమినగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పుస్తకాన్ని పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. అన్నం శివకృష్ణ రచించిన దుఃఖపు తర్జుమా పుస్తకాన్ని వైద్యురాలు పెళ్లకూరు జయప్రద ఆవిష్కరించగా, రచయిత రాధేయ సమీక్షించారు. అనంతరం శివకృష్ణను సత్కరించారు. పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, చిన్ని నారాయణరావు, సుంకర గోపాల్, సునీల్, మోపూరు పెంచలనరసింహం, తోట సులోచన, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయడం తగదు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయడాన్ని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మానుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆదివారం నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తూ, మరోవైపు ఖాళీలను బ్లాక్ చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల సుదూర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల్లో అన్యాయం జరుగుతుందని చెప్పారు. సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శివకోటారెడ్డి, రాష్ట్ర బాధ్యులు బాలాత్రిపురసుందరి, జుల్ఫికర్ అలీ, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లురెడ్డి, జనార్దన్, కరీంమొహిద్దీన్, సుంకు వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు రాజశేఖర్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. బోడిగాడితోట సమీపంలోని అరవపాళెంలో ఆదివారం పర్యటించిన ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ నందన్, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, లెక్కల వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (టౌన్): నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడిగా రఘురామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులకు దంత పరీక్షలను స్మైల్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు నిర్వహించారు. వయస్సు రీత్యా పెద్దగా ఉన్న వెంకటేశ్వర్లును సత్కరించారు. పూర్వాధ్యక్షుడు సుకుమార్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పెరుగు రామకృష్ణ, రమణయ్య, కోటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆయుర్వేదానికి ప్రాభవం

- నాడు అల్లోపతి వైద్యం వైపు మొగ్గు
- నేడు ఆయుర్వేదం వైపు అడుగులు



విరువూరు ఆయుర్వేద వైద్యశాల

పొదలకూరు : ప్రాచీన ఆయుర్వేదానికి తిరిగి ప్రాభవం ప్రారంభమవుతోంది. ఇన్నాళ్లు అల్లోపతి వైద్యం వైపు పరుగులు తీస్తున్న జనం తిరిగి ఆయుర్వేద వైద్యంపై నమ్మకం పెంచుకుంటున్నారు. లేహ్యాలు, చూర్ణాలను వాడుతున్నారు. మండలంలోని విరువూరులో ఏడు దశాబ్దాలపైబడి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఉంది. అల్లోపతి వైద్యం ప్రాచుర్యంలో లేని కాలంలో విరువూరు ఆయుర్వేద వైద్యశాల చుట్టుపక్కల గ్రామాలకు ఆయుర్వేద వైద్యమే ప్రధానంగా ఉండేది. కాలక్రమంలో అల్లోపతి వైద్యం వేగం అందుకోవడంతో ఆయుర్వేదంపై నమ్మకం ఉన్నవారు మాత్రమే విరువూరు వైద్యశాలకు వెళుతున్నారు. 1955లో బెజవాడ గోపాల్‌రెడ్డి ఇక్కడి ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించారు. అప్పటి నుంచి రెండు దశాబ్దాలుగా చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లేవారు. రోగులకు సేవలను అందించేందుకు ఒక నర్సు పోస్టును కూడా ఏర్పాటు చేశారు. పక్కనే నర్సు క్వార్టర్స్‌ను నిర్మించారు. వైద్యులు నైపుణ్యంతో ఇక్కడి వైద్యశాలలో శస్త్రచికిత్సలు, కాన్పులు కూడా చేశారు. అప్పట్లో వైద్యశాల కోసం నిర్మించిన భవనం ఇప్పటికీ చెక్కు చెదర లేదు.

అందుబాటులో ఆయుర్వేద వైద్యం

విరువూరు ఆయుర్వేద వైద్యశాలకు ప్రస్తుతం డాక్టర్ అందుబాటులో ఉన్నారు. ఈ వైద్యశాల నుంచి దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం లభిస్తుందని పలువురు జబ్బు నయం అయిన వారు చెబుతున్నారు. సంగం, బుచ్చిరెడ్డిపాళెం తదితర ప్రాంతాల నుంచి దీర్ఘకాలిక రోగాలకు మందుల కోసం విరువూరు వైద్యశాలకు వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒక వైద్యాధికారి, కాంపౌండర్, అటెండర్ ఉన్నారు. ఆయుర్వేదంలో చూర్ణాలు, లేహ్యాలు లేకుండా మాత్రలను పంపిణీ చేస్తుండడం వల్ల కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పిల్లలకు తగిన మోతాదులో ఆయుర్వేద మందులను పంపిణీ చేయాలంటే వీలుపడడం లేదు. చూర్ణాలు, లేహ్యాలు ఉన్నట్టు అయితే తగు మోతాదులో పంపిణీ చేసేందుకు అవకాశం ఉండేది. ఆయూష్ కిందకు వచ్చే ఆయుర్వేదం, హోమియో, యోగా, నాచురోపతి, సిద్ధ వైద్యాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పెరగాల్సి ఉంది. మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో ఆయుర్వేద ఆస్పత్రిని రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అయితే ఆయుర్వేద ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడం, నిరాదరణకు గురికావడం వల్ల తొలగించారు.

ఆయుర్వేదం ఉత్తమం



ఆయుర్వేదంలో అన్ని రకాల జబ్బులకు మందులు ఉన్నాయి. వైద్యాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళతాం. విరువూరు వైద్యశాలలో ఓపీ కూడా చూస్తున్నాం. షుగర్, బీపీ వ్యాధులకు సంబంధించి రోగులు వస్తున్నారు.
– పీ వినోద్‌బాబు, ఆయుర్వేద వైద్యాధికారి, విరువూరు



వైద్యశాలలోని ఆయుర్వేద మందులు



మహ్మదాపురంలో శిథిలావస్థలో ఉన్న ఆయుర్వేద వైద్యశాల

మురళీనాయక్‌కు ఘన నివాళి

తోటపల్లిగూడూరు : ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు మండలంలోని కోడూరులో ఆదివారం నివాళులర్పించారు. బొబ్బేపల్లి సురేష్ ఆధ్వర్యంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పొదలకూరు: పెంచలకోనం బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ మార్గంలో పయనించే భక్తులకు వేసవి తాపం తీర్చేందుకు స్థానికులు పలువురు పంచాయతీ బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న భక్తులకు మజ్జిగను అందజేశారు. మూడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగిశెట్టి దామోదరావు, లక్కాకుల ఆనంద్‌రావు, తమ్ముల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కసుమూరులో ఆదివారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన కరీముల్లా పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కరీముల్లాకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వేడుకగా నందిసేవ



ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరుడికి నందిసేవను వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా తోటపల్లి వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ



రామాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

పొదలకూరు: పట్టణంలోని రామమందిరం సెంటర్‌లో కోదండరామస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా భూమి పూజ మహోత్సవం నిర్వహించారు. గతంలో ఆలయం పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఉభయకర్తలు, భక్తులు కలిసి ముందుగా బాలాలయాన్ని నిర్మించి ఉత్సవ విగ్రహాలు, పటాలను అందులో ఏర్పాటు చేశారు. పాత ఆలయాన్ని తొలగించి అదే స్థలంలో కొత్తగా నిర్మించేందుకు ఉదయం 6.54 గంటలకు శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పాఠ్యాంశ షార్ట్ ఫిల్మ్ ఆవిష్కరణ



కొడవలూరు: ఆరో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలోని జన్మదిన్ పాఠ్యాంశాన్ని షార్ట్ ఫిల్మ్‌గా మండలంలోని గండవరం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు నాగభూషణం స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. దీన్ని నెల్లూరులోని విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం డీఈఓ బాలాజీరావు మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బోధించడం ద్వారా విద్యార్థులకు సత్వరమే అవగాహన లభించడంతో పాటు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతారని చెప్పారు. ఈ వీడియోను యుట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేయనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని మెరుగైన బోధన చేసే వెసులుబాటు ఉంటుందన్నారు. అనంతరం నాగభూషణాన్ని సత్కరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పంచేడులో 33 / 11 సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా బుచ్చిరెడ్డిపాళెం గ్రామీణ ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.

రూ.14 లక్షలతో ఓసూరమ్మ ఆలయానికి ప్రహరీ



ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సోమిరెడ్డి

మనుబోలు: మండలంలోని గురివిందపూడి సమీపంలో ఉన్న ఓసూరమ్మ ఆలయానికి దాతల సాయం రూ.14 లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఓసూరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వేపల్లి శివకుమార్, మోమిడి ప్రసాద్, గాలి రామకృష్ణారెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, కలికి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి నరసింహస్వామి జయంతి సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు ఉదయం లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ఉభయక్తలుగా నాగసూరి శ్రీనివాసులు,రజిని, వెంకటేష్,అలేఖ్య, సుజీవన్, అనూష దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

డీఎస్సీపై అవగాహన సదస్సు నేడు

నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీపై అవగాహన సదస్సును సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని ట్రస్ట్ బాధ్యుడు నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును పోటీ పరీక్షల నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు సారథ్యంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్‌ను అందజేయనున్నామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీబీఎస్ఈ స్కూల్ ప్రారంభం



నెల్లూరు (టౌన్): మైపాడు రోడ్డులోని ప్రశాంతినగర్‌లో నారాయణ సీబీఎస్ఈ స్కూల్‌ను విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తరగతులను వచ్చే నెల 12 నుంచి ప్రారంభించనున్నామని వెల్లడించారు.

నైపుణ్య వెలికితీతకు క్రీడలు ఎంతో అవసరం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. మేడే సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆప్కాస్, పర్మనెంట్ ఉద్యోగులకు క్రికెట్ పోటీలను ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కమిషనర్ బ్యాటింగ్ చేయగా, ఈఈ జానీబాషా బౌలింగ్ వేసి సిబ్బందిని ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా నందన్ మాట్లాడారు. సిబ్బందికి క్రీడాపోటీలను క్రమం తప్పకుండా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నెల్లూరు నగరపాలక సంస్థను ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నేతలు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, పెంచలయ్య, అశోక్, శ్రీనివాసులు, జయకుమార్, మనోజ్, రాంబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



గోవుకు నామకరణం చేస్తున్న ఈషాప్రియ తీర్థానంద

కోవూరు: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉడుపి అడమారు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థానంద పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర కోవూరుకు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా శాంతినగర్‌లోని పోలేరమ్మ తల్లి దేవస్థానంలో హారతులిచ్చి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. శాంతినగర్‌లో పడుగుపాడు సొసైటీని సందర్శించి అక్కడ రైతులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. మల్లికార్జున్‌రెడ్డి నిర్వహిస్తున్న గోశాలను సందర్శించి కపిల గోవుకు వసుప్రదగా నామకరణం చేశారు. గోశాల యజమానిని అభినందించారు. అనంతరం దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వచ్చేశారు. సుబ్బారావు, ధర్మసింధు నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మొగిలి రమేష్, మేకల నరసింహారావు, పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, రైతులు విజయసాయిరెడ్డి, సత్యనారాయణరెడ్డి చిన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఘన నివాళి



జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



బీజేపీ ఆధ్వర్యంలో..

నెల్లూరు(బారకాసు): పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఎన్టీఆర్‌నగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేశారు. సంజయ్, కిరణ్, జగన్, వెంకటేష్, శ్రీను, అంకయ్య, సురేష్, చంద్రశేఖర్, జనార్దన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి బీజేపీ నేతలు నివాళులర్పించారు. చిన్నబజార్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, నేతలు హేమంత్, మాల్యాద్రి, బాలాజీ, లాల్‌ఖాజామస్తాన్, శ్రీనివాసులు, తిరుమల, అరుణాచలం, దయాసింగ్, బాలాజీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వీరజవాన్లకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రఘురామ్ ముదిరాజ్, రంగారావు, పాబోలు సత్యనారాయణ, స్నేహ సురేష్, నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు, రమణయ్య, రామారావు, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, నరసయ్య, అనంతరామారావు తదితరులు పాల్గొన్నారు.



ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో..

ప్రభుత్వం చర్చలు జరిపేంత వరకు సమ్మె



నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లపై ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేసేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పేర్కొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి నిర్వహిస్తున్న సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరుకుంది. సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయ ఎదుట చేపట్టిన నిరసనలో సీహెచ్ఓల అసోసియేషన్ కార్యదర్శి రుబికా మాట్లాడారు. తాము ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ప్రశాంతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.